సాక్షి మంచిర్యాల

గురువారం : 29, మే : 2025



ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల

బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 31నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. బాసరలో 1500సీట్లు, మహబూబ్ నగర్‌లో 180 సీట్లు ఉన్నాయి. 8లో▸



పత్తి మద్దతు ధర రూ.8,119

ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి వివిధ రకాల పంటలకు మద్దతు ధరలు ప్రకటించింది. పత్తికి క్వింటాల్‌కు రూ.8,110 ప్రకటించగా.. గతం కంటే రూ.589 పెరిగింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /27.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు ఉపాధి



పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రూ.50 వేలు, రూ.లక్ష యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేసి జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్, షెడ్యూల్ కులాల సహకార సంస్థ అధికారి దుర్గప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సీఎం అభినందన




చెక్కు అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

జైపూర్: జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ కోలా నాగేశ్వర్‌రావును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించి గురుకుల అభివృద్ధికి చెక్కు అందజేశారు. గురుకులం 2024–25 విద్యాసంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్ర స్థాయిలో అభినందనలు లభించాయి. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురుకులం సొసైటీ సెక్రెటరీ అలుగు వర్షిణి, కాళేశ్వరం జోనల్ ఆఫీసర్ అరుణకుమారి పాల్గొన్నారు.

నేడో, రేపో రైతులకు పంట నష్ట పరిహారం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అకాల వర్షాలతో యాసంగిలో వరి, మొక్కజొన్న, మామిడి పంటలు నష్టపోయిన రైతుల ఖాతాల్లో నేడో, రేపో పరిహారం జమ కానుంది. గత మూడు నెలల్లో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. రైతులకు పరిహారం అందించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం ప్రకటించారు. మార్చిలో జన్నారం, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో 162 మంది రైతులకు సంబంధించి మొక్కజొన్న, వరి, పంటలు 120.17 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఏప్రిల్‌లో జన్నారం, హాజీపూర్ మండలాల్లో 224 మంది రై తుల వరి పంట 199.23 ఎకరాలు, మేలో భీమారం, నెన్నెల, భీమిని, చెన్నూర్ మండలాల్లో 1,898 మందికి చెందిన మామిడి, వరి పంటలు 3186.13 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించారు. మూడు విడతల్లో నష్టపోయిన పంటల కు సంబంధించి ఎకరానికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.3,50,63,250 అందనుంది.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని నిర్మాణ రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్ష కార్డు అందజేస్తున్నారు. కార్మిక శాఖలో నమోదైన కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తుండగా.. ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి కార్డు అందజేస్తున్నట్లు సీఎస్‌సీ హెల్త్ కేర్ కోఆర్డినేటర్ రవితేజ తెలిపారు. మంచిర్యాల నగర పాలక సంస్థ కార్యాలయంలో, లక్సెట్టిపేట, చెన్నూరు, భీమి ని, భీమిని మండలం లక్ష్మీపూర్, మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌లో శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అటకెక్కిన మన బడి



మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన 'మన ఊరు–మనబడి' డైనింగ్ హాల్ పనులు

సాక్షి విజిట్

- 'అమ్మ ఆదర్శ' పనుల్లో కాస్త మెరుగు
- ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభంలోపు పూర్తయ్యేనా..!

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం గత ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేసింది. 733 కమిటీలు ఏర్పాటు కాగా.. 532 పాఠశాల ల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు నవీకరణ, చిన్నపాటి మరమ్మతులకు రూ.18.96కోట్లు కేటాయించింది. కొన్ని చోట్ల పనులు వేగవంతం కాగా.. మరికొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. బడులు పునః ప్రారంభంలోపు పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా మారనుంది. ఇంకా 274 పాఠశాలల్లో కిచెన్‌షెడ్లు అవసరమని గుర్తించారు. ఇందులో కొన్ని 'మన ఊరు–మన బడి' పనుల కింద చేపట్టగా వివిధ కారణాల వల్ల ఆగిపోయాయి. మరికొన్ని చోట్ల కిచెన్ షెడ్లు లేకపోవడంతో చెట్ల కింద, వరండాలో మధ్యాహ్నం వంట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 165 పాఠశాలల్లో ప్రహరీలు లేకపోవడం, చిన్న చిన్న మరమ్మతు చేపట్టాల్సి ఉంది. 33 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.



తాగునీటి కుళాయిలు బిగించని దృశ్యం

'మన ఊరు–మన బడి'

జిల్లాలో 2022లో గత ప్రభుత్వం అమలు చేసిన 'మన ఊరు–మన బడి' పనులు అటకెక్కాయి. మూడేళ్ల నుంచి పనులు ముందుకు సాగడం లేదు. నిధులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. మొదటి విడతలో 245 పాఠశాలల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బందికి సరిపడా ఫర్నిచర్, మరమ్మతులు, కిచెన్‌షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్తవి నిర్మాణం చేపట్టారు. 69 అదనపు గదులు మంజూరు కాగా 63 పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. 9ఫౌండేషన్ వరకు, 10 బేస్‌మెంటు, 16రూఫ్‌లెవల్ స్థాయిలో నిలిచిపోయాయి. 180 పాఠశాలల్లో మరుగుదొడ్ల పనులు చేపట్టగా.. 92చోట్ల పనులు పూర్తి కాగా, ఎనిమిది చోట్ల చివరి దశలో ఉన్నాయి. 66పాఠశాలల్లో పనులు సాగుతుండగా.. 14చోట్ల పనులు ప్రారంభం కాలేదు.

భోజనశాలలూ అంతే..

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమం చేపట్టింది. పాఠశాలల్లో విద్యార్థులు వరండా, ఆవరణలోని చెట్ల కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేసేవారు. 'మన ఊరు–మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులు సామూహికంగా కూర్చుని మధ్యాహ్న భోజనం చేయడానికి వీలుగా అన్ని వసతులతో కూడిన డైనింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టగా చివరి దశలో నిలిచిపోయాయి. రూ.12లక్షల నుంచి రూ.13లక్షలకు పైగా వెచ్చించారు. జిల్లాలో 60 పాఠశాలలకు గాను 20చోట్ల పనులు పూర్తి కాగా ఫర్నిచర్ కొనుగోలు చేస్తే అందుబాటులోకి వస్తాయి. ఇందులో కొన్ని రూఫ్, బేస్‌మెంట్, ఫౌండేషన్ లెవల్‌కు పరిమితం అయ్యాయి. నిధులు సకాలంలో విడుదల కాక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అమ్మ ఆదర్శ పనుల కింద మన ఊరు–మన బడి కింద చేపట్టిన పాఠశాలలను ఎంపిక చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.



శిథిలావస్థలో ఉన్న బెల్లంపల్లి రాంనగర్ ప్రాథమిక పాఠశాల భవనం



నిర్మాణ దశలో ఉన్న ఆకెనపల్లి జెడ్పీ హైస్కూల్ అదనపు తరగతి గది

సమస్యల్లోనే స్కూళ్లు

బెల్లంపల్లి/కాసిపేట/తాండూర్/భీమిని/వేమనపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని రాంనగర్‌బస్తీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా నీటితో నిండిపోతుంది. కొత్త భవన నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు అటకెక్కడంతో ఈసారీ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టేకులబస్తీ జెడ్పీ హైస్కూల్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, రడగంబాల బస్తీ ప్రాథమికోన్నత పాఠశాల, శాంతిఖని జెడ్పీ హైస్కూల్‌లో వంటషెడ్లు, తాగునీటి సౌకర్యం, తరగతిగదులు, మరుగుదొడ్లు సరిగా లేవు.

- బెల్లంపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆకెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. అంకుశం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, బుధాకలాన్ ఎస్టీ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో ప్రహరీ, కిచెన్‌షెడ్ల నిర్మాణం మందకొడిగా సాగుతోంది.
- తాండూర్ మండలం అచ్చులాపూర్ కాపువాడ, తాండూర్ అంగడిబజార్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉంది. అనుమతి రాక పనులు చేపట్టలేదు. ఆవులు, గేదెలు పాఠశాలల ఆవరణను అపరిశుభ్రం చేస్తున్నాయి. కత్తెర్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పైకప్పు, ఫ్లోరింగ్ ధ్వంసమయ్యాయి.
- భీమిని మండలం కేస్లాపూర్ పాఠశాల నిర్మాణ దశలోనే ఆగిపోయింది. ఆ బడి విద్యార్థులు దగ్గరలోని గట్టుపల్లి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. గదుల కొరతతో ఒకే గదిలో రెండు పాఠశాలలు కొనసాగుతున్నాయి. పెద్దపేట ప్రైమరీ, భీమిని ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కన్నెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జంగంపల్లి ప్రైమరీ పాఠశాలలో 'మన ఊరు–మన బడి' పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.



కేస్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

- వేమనపల్లి మండలంలోని 23పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ప్రభుత్వం నిధులు కేటాయించింది. గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కింద ఎంపిక చేసిన 11పాఠశాలల్లో మిగిలి ఉన్న పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక చేశారు. వీటిలో నీల్వాయి ఎస్టీ కాలనీ, నీల్వాయి ప్రైమరీ స్కూల్ పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో అడపాదడపా పనులు మిగిలి ఉన్నాయి. పెయింటింగ్ పనులు ఇంకా కొన్ని పాఠశాలల్లో పూర్తి కాలేదు. పనులు పూర్తి చేసిన స్థానిక ఎస్‌హెచ్‌జీలకు రెండు విడతల బిల్లులు మాత్రమే వచ్చాయి. మరో రెండు విడతల బిల్లులు రాక సతమతం అవుతున్నారు. కొన్ని పాఠశాలలకు ఉపాధిహామీ నిధులతో ప్రహరీ పనులు పూర్తి చేస్తున్నారు. కల్మలపేట ఎంపీపీఎస్‌లో భూ వివాదంతో ప్రహరీ పనులు నిలిచాయి.
- కాసిపేట మండలం పెద్ద ధర్మారంలో ప్రహరీ, తాటిగూడలో అభివృద్ధి పనులు, పెద్దనపల్లి యూపీఎస్‌లో నల్లా కనెక్షన్లు, వరిపేట ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ, రన్నింగ్ వాటర్, బిగించిన నల్లాలు చెడిపోయినా మరమ్మతులు చేపట్టలేదు. తరగతి గదుల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు.

అసంపూర్తిగా పనులు

చెన్నూర్/భీమారం/కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అసౌకర్యంగా మారడంతో త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. చెన్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం పూర్తి కాలేదు. నాలుగు తరగతి గదుల్లోనే పది తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొంది. గత ఏడాది కాలంగా పనులు ముందుకు సాగడం లేదు.



దండేపల్లి: జెడ్పీ హైస్కూల్‌లో పూర్తి కాని గదులు

- భీమారం మండలంలోని మూడు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. ధర్మారం ప్రాథమిక పాఠశాలలో ప్రహరీకి రంగులు వేయాల్సి ఉంది. భీమారం ఎస్సీ కాలనీ పాఠశాలలో గేట్ల పనులు కొనసాగుతున్నాయి. ఆర్కెపల్లి పాఠశాలలో పనులు పూర్తయ్యాయి. ఒక్కో పాఠశాలలో ప్రహరీ, గేట్లు బిగించే పనులకు రూ.10లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేయగా.. పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.



కోటపల్లి: పుల్లగామలో అసంపూర్తిగా భవనం



చెన్నూర్ జెడ్పీ పాఠశాల భవన నిర్మాణం ఇదీ..

- కోటపల్లి మండలం పుల్లగామ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. వంటషెడ్డు, నల్లా కనెక్షన్, భవన నిర్మాణం పూర్తి కాలేదు.

దండేపల్లిలో..

దండేపల్లి: మండలంలో 'మన ఊరు–మన బడి' పథకం కింద 16 పాఠశాలలు ఎంపిక చేశారు. పెద్దపేట, మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలు, మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో అసంపూర్తిగా మిగిలిపోయాయి. అందులో కొన్నింటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పూర్తి చేశాయి. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల తోపాటు డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ అలాగే వదిలేశారు.

పదవొస్తుందా?

- కేబినెట్ బెర్త్ కోసం ఎమ్మెల్యేల పోటాపోటీ
- పార్టీ, నామినేటెడ్ పోస్టులపైనా ఉత్కంఠ
- హస్తం పార్టీ ఆశావహుల్లో టెన్షన్ టెన్షన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం మొదలు కావడంతో ఎవరిని ఏ పదవి వరిస్తుందోననే ఉత్కంఠ శ్రేణుల్లో నెలకొంది. ఈ నెల 30న పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశం ఉంది. అదే సమయంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే నేపథ్యంలో పార్టీ నాయకుల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతున్న తరుణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరిని అమాత్య పదవి వరిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఖానాపూర్, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలకే మంత్రి యోగానికి అవకాశం ఉంది. వీరిలో చెన్నూర్, మంచిర్యాలతోపాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేబినెట్ బెర్త్ కోసం ఢిల్లీ దాకా లాబీయింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఎవరికి వస్తుందో చెప్పలేని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో సామాజిక వర్గాలు, సీనియర్లు తదితర అంశాల నేపథ్యంలో అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందోనని ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

పదవుల్లో మొండి 'చెయ్యి'

ఉమ్మడి జిల్లా నుంచి అనేక మంది పార్టీలో రాష్ట్ర స్థాయి నాయకులు ఉన్నా వారికి సముచిత అవకాశాలు రాలేదని నిరాశలో ఉన్నారు. ఇప్పటి వరకు ఆదివాసీ నాయకుడు కోట్నాక తిరుపతి ఒక్కరికే రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఆయన పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో జోడోయాత్రలో చురుగ్గా ఉండడంతో మొదటి దఫాలో ఆయనను పదవి వరించింది. ఇక కార్మిక సంఘాల కోటాలో జనక్‌ప్రసాద్‌కు రాష్ట్ర కనీస వేతన బోర్డు చైర్మన్‌గా అవకాశం దక్కింది. ఆ తర్వాత ఎవరికీ దక్కలేదు. ఇటీవల నామినేట్ చేసిన ఎమ్మెల్సీ స్థానాల్లోనూ ఎవరికి అవకాశం రాలేదు. అలాగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నుంచి ఉమ్మడి జిల్లా నాయకులకు పోటీ చేసేందుకు టికెట్ కూడా ఇవ్వలేదు. తర్వాత రాష్ట్ర కార్పొరేషన్ పదవులు, పార్టీ పదవుల్లో తమకు అవకాశం వస్తుందని అంతా ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యేలు సైతం పార్టీలో చేరినప్పటికీ ఎవరికి అవకాశం రాలేదు.



కేడర్‌లో నారాజ్

ఆయా నియోజకవర్గాల్లో టికెట్ ఆశించి భంగపడిన నాయకులు ఉన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా పట్టుకుని కష్టకాలంలోనూ పని చేస్తున్న వా రున్నారు. సీనియర్ నాయకులతోపాటు అనేక మంది యువ నాయకులు, మహిళా, విద్యార్థి, యువజన, కార్మిక అనుబంధ సంఘాల నుంచి అనేక మంది ఉన్నారు. అందరూ తమ స్థాయిని బట్టి పదవుల్లో ప్రాధాన్యతను కోరుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల నుంచి సీనియర్ నాయకుల పేర్లు పీసీసీ పదవుల్లో చోటు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపారు. వారితోపాటు నాయకులు సైతం తమకున్న పరిచయాలతో గాంధీభవన్‌లో ఇప్పటికే తమ బయోడేటాలతో కూడిన వివరాలు అందజేశారు. తమకు పదవుల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

మందమర్రి పట్టణంలో సమస్యలా..!

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి 'సాక్షి' ముందుకొచ్చింది. శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. వర్షాకాలం రానున్న దృష్ట్యా మీ పరిధిలోని సమస్యలను ప్రస్తావించి పరిష్కారం కోరవచ్చు. మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఫోన్ ఇన్ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారు.



మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు

'సాక్షి' ఆధ్వర్యంలో రేపు ఫోన్ ఇన్

సమయం : శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సెల్‌ఫోన్ నంబర్లు: 77807 82333, 99497 03181

ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి

- రాష్ట్ర ప్రజా ఉద్యమాల పోరాట సమితి అధ్యక్షురాలు విమలక్క

చెన్నూర్: కర్రిగుట్టల్లో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ గిరిజనులపై చేస్తున్న మారణహోమాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర అరుణోదయ కళాకారిణి, రాష్ట్ర ప్రజా ఉద్యమాల పోరాట సమితి అధ్యక్షురాలు విమలక్క, సీపీఐఎంఎల్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి అన్నారు. బుధవారం చెన్నూర్ పద్మశాలి భవనంలో వామపక్షాల ఆధ్వర్యంలో కగార్ వ్యతిరేక సమావేశం నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన అమరవీరులకు నివాళులు అర్పించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ మావోయిస్టులు శాంతిచర్చలు జరపాలని కోరినా మారణకాండ సాగించడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నంలో భాగంగా సల్వాజుడుం, ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ మృతుల దేహాలను బంధువులకు అప్పగించకపోవడం దారుణమని, మారణహోమంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురి సదానందం, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు బాస్కర్, విశ్వనాథ్, గంట సత్యం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కుమార్, మల్లన్న, అంజయ్య, చంద్రశేఖర్, జైపాల్‌సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

చెరువులకు గండ్లు పడకుండా చూడాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: భారీ వర్షాలతో చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో నీటి పారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల నీటిమట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని నీల్వాయి ప్రాజెక్టు, కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. నీటి పారుదల ఎస్‌ఈ విష్ణుప్రసాద్, మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ల డీఈఈలు, ఏఈఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్రవాగు బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

నెన్నెల: ఎర్రవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తాత్కాలిక కాజ్‌వే నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నెన్నెల మండలంలో పర్యటించారు. భారీ వర్షానికి దెబ్బతిన్న ఎర్రవాగు తాత్కాలిక వంతెనను పరిశీలించారు. వర్షాలతో బ్రిడ్జి పనులు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జంగాల్‌పేట పంచాయతీ పరిధి కొత్తగూడంలో ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జోగాపూర్, ఆవుడం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్, ఎంఆర్‌ఐ సులోచన, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, ఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవాగు వంతెన వద్ద అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు, జిల్లాలో పని చేస్తున్న వారిని బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నస్పూర్ తహసీల్దార్ పి.శ్రీనివాస్‌ను కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఈ సెక్షన్‌కు, ఈ సెక్షన్‌లో ఉన్న ఎస్.సంతోస్‌కుమార్‌ను నస్పూర్‌కు, వెయిటింగ్‌లో ఉన్న డి.సునీల్‌ను కలెక్టర్ సీ సెక్షన్‌కు, డి.రోహిత్‌ను దండేపల్లికి బదిలీ చేశారు.

క్లుప్తంగా

తరుణం వాగులో ఒకరు గల్లంతు


దత్తు (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని తరుణం వాగులో లక్ష్మింపూర్ గ్రామానికి చెందిన లాండిగే దత్తు గల్లంతైనట్లు ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో మునిమ్‌గా పనిచేస్తున్న దత్తు మంగళవారం పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి తరుణం బ్రిడ్జి వద్ద గల తాత్కాలిక లోలెవల్ వంతెనపై నీరు ఉప్పొంగి ప్రవహించింది. వంతెన దాటే క్రమంలో వరదలో కొట్టుకుపోయాడు. స్థానికులు తాడును విసిరి రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ వరద ప్రవాహం ఎక్కువ కావడంతో గల్లంతయ్యాడు. పోలీసులు గజ ఈతగాళ్లతో వెతికిస్తున్నప్పటికీ బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. దీంతో దత్తు తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

జైపూర్: మండలంలోని షెట్‌పల్లిలో తుంగపిండి రాజేశ్ అనే రైతుకు చెందిన రెండు గేదెలు పిడుగు పాటుకు మృతి చెందాయి. బుధవారం మేత కోసం బయటకు వెళ్లిన గేదెలు షెట్‌పల్లి శివారులోని పంట పొలాల్లో మేస్తుండగా పిడుగు పాటుకు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

రెబ్బెన: మండలంలోని వంకులం సమీపంలో బుధవారం ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టిన సంఘటనలో వాంకిడి మండలంలోని జైత్‌పూర్‌కు చెందిన కోలే సక్కయ్య (73) మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు సక్కయ్య బైక్‌పై బయలుదేరాడు. వంకులం సమీపంలో కాగజ్‌నగర్ వైపు నుండి వస్తున్న కారు సక్కయ్య బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని కుమారుడు కోలె గణపతి ఫిర్యాదు మేరకు పెద్దపల్లి జిల్లా చొప్పదండికి చెందిన కారు డ్రైవర్ ఎస్‌కే మెహరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హైవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని కాలేజీరోడ్డులో గల టీచర్స్ కాలనీలో బుధవారం విద్యుత్ హైఓల్టేజీతో ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. ఒక్కసారిగా హైవోల్టేజీ రావడంతో ఫ్రిడ్జ్‌లు, ఏసీలు, ఫ్యాన్లు, ఐరన్‌బాక్స్‌లు, టీవీలు కాలిపోయాయి. రోజంతా హై ఓల్టేజీతోనే విద్యుత్ సరఫరా కావడంతో ప్రజలు భయాందోళన చెందారు.

ఎస్సీ రోస్టర్ రికార్డుల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్సీ రోస్టర్ రికార్డులను బుధవారం చీఫ్ లైసెన్ ఆఫీసర్ ఫర్ ఎస్సీ కార్పొరేట్ (జనరల్ మేనేజర్) దుర్గం రాంచందర్ తనిఖీ చేశారు. ఏరియాలో అన్ని పదోన్నతులు రోస్టర్ పద్ధతిలో చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, లైసెన్ ఆఫీసర్ మైత్రేయబంధు పాల్గొన్నారు.

సీవోఈ విద్యార్థులకు బహుమతులు అందజేత

బెల్లంపల్లి: చదువులో రాణిస్తున్న తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో, ఐఐటీ, జేఈఈ, నీట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన, క్రీడాపోటీల్లో రాణిస్తున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. బెల్లంపల్లి సీవోఈలో చదివిన జే.అశ్రిత్‌రామ్ (పదో తరగతి టాపర్), దుర్గం చరణ్ తేజ్ , తీగల అశ్రిత్ (ఐఐటీ విద్యార్థులు), పొట్ట లక్ష్మీనర్సింహా (బాక్సింగ్ గోల్డ్ మెడలిస్ట్)లకు నగదు, ల్యాప్‌టాప్ అందించి అభినందించారు.


గంజాయి మొక్కలు స్వాధీనం

బోథ్: సొనాల మండలంలోని పార్డి కెలో గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్ తెలిపారు. గులాబ్ సింగ్ ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు, రామ్‌సింగ్ చౌహాన్ పెరటిలో మూడు మొక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల

- బాసర క్యాంపస్‌లో 1500 సీట్లు
- మహబూబ్‌నగర్ సెంటర్‌కు 180..
- ఈనెల 31 నుంచి దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తులు పంపించాల్సిన చిరునామా
ది కన్వీనర్
యూజీ అడ్మిషన్స్ 2025–26
రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్
బాసర, నిర్మల్ జిల్లా
తెలంగాణ రాష్ట్రం, పిన్:504107



నోటిఫికేషన్ విడుదలచేస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

భైంసా: ట్రిపుల్‌ఐటీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులంతా రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశాల నోటిఫికేషన్ కోసం నిరీక్షించారు. బుధవారం బాసర క్యాంపస్‌లో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అధికారులతో కలిసి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి బాసర క్యాంపస్‌కు 1500 సీట్లు కేటాయించారు. కొత్తగా మహబూబ్‌నగర్ సెంటర్‌కు 180 సీట్లు కేటాయించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభమయ్యే మహబూబ్‌నగర్ సెంటర్‌కు సంబంధించి 180 సీట్లు పెరగనున్నాయి.

ఈ నెల 31 నుంచి దరఖాస్తులు
ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు సంబంధించి ఈనెల 31 నుంచి టీఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న అభ్యర్థులకు జూన్ 25 గడువు విధించారు. జూలై 4న సీట్లు దక్కించుకున్న విద్యార్థుల మెరిట్ జాబితాను విడుదలచేయనున్నారు. జూలై 7న కౌన్సిలింగ్ ప్రారంభించనున్నారు.

గ్రామీణ విద్యార్థులకు వరం
గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించే బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా పోటీపడుతుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ సువర్ణావకాశంగా మారింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు సంబంధించి ఏటా పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి అందులో అర్హత ఉన్నవారిని ఎంపికచేసి సీట్లను కేటాయిస్తుంది.

విద్యావిధానం
ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ ఆధారంగా ట్రిపుల్‌ఐటీలో బోధన కొనసాగుతుంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సును నేర్పిస్తారు. రెండేళ్ల పీయూసీ అనంతరం అందులో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్, దుస్తులు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్, హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తుంది. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు సైతం తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

అప్లికేషన్ ఫీజు...
ట్రిపుల్‌ఐటీలో ఓసీ, బీసీ విద్యార్థులకు అప్లికేషన్ ఫీజు రూ.500, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.450, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు గ్లోబల్ కేటగిరీ కింద రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. ప్రతీ విద్యార్థి టీఎస్ ఆన్‌లైన్‌లో సర్వీసు చార్జీల కింద రూ.25 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకటి కంటే అధికంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అందులో చివరగా చేసుకున్న దరఖాస్తునే పరిగణలోకి తీసుకుంటామని అధికారులు ప్రకటించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులు సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటాలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతులను స్పీడ్, రిజిస్టర్ పోస్టు ద్వారా జూన్ 25లోపు బాసర క్యాంపస్‌కు కింద సూచించిన అడ్రస్‌కు పోస్టు చేయాలని అధికారులు సూచించారు.

విడుదల చేశాం
ట్రిపుల్‌ఐటీ ప్రవేశాల నోటిఫికేషన్ బాసర క్యాంపస్‌లో విడుదల చేశాం. ఈనెల 31 నుంచి పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులంతా టీఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 21 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులు ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా విద్యార్థులకు జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నాం. జూలై 4న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తాం. జూలై 7న కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తాం. – ప్రొఫెసర్ గోవర్ధన్, వీసీ, బాసర ట్రిపుల్‌ఐటీ

ఢిల్లీ జాతీయ సదస్సుకు డాక్టర్ శ్రీధర్


సదస్సుకు హాజరైన డాక్టర్ శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: న్యూ ఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్టేక్‌హోల్డర్ కన్సల్టేషన్ సదస్సులో ఆదిలాబాద్ జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ బుధవారం పాల్గొన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరయ్యారు. దేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యయనాన్ని బలోపేతం చేయడం అనే అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రముఖులు, విధాన నిర్ణేతలు, వైద్య, ఆరోగ్య రంగ నిపుణులు హాజరయ్యారు. శ్రీధర్‌తో పాటు నల్గొండ జిల్లా నుంచి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి డాక్టర్ మధు వరన్ కూడా పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

భైంసాటౌన్: గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన భైంసా పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఏపీలోని కృష్ణా జిల్లా గన్నవరంకు చెందిన ఎస్‌కే కరీముల్లా గుజరాత్ నుంచి విజయవాడ వైపు లారీలో వెళ్తుండగా అస్వస్థతకు గురికావడంతో మరో డ్రైవర్ లారీ నడుపుతున్నాడు. భైంసా పట్టణంలోని భోకర్ చౌరస్తాకు చేరుకోగానే కరీముల్లా మృతి చెందాడు. సీఐ గోపీనాథ్ సంఘట స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు.

కుర్చీలోనే కన్ను మూశాడు

- ఇందన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి హఠాన్మరణం
- ఆర్థిక ఇబ్బందులు, పనిఒత్తిడే కారణమంటున్న కుటుంబ సభ్యులు


కుర్చీలోనే కన్నుమూసిన చంద్రమౌళి

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి ఎర్రోజుల చంద్రమౌళి (58) బుధవారం హఠాన్మరణం చెందాడు. ఉదయం కుర్చీలో కూర్చున్న ఆయన గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా వారం రోజులు కాళేశ్వరంలో విధులు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంతేకాకుండా ఏడాదిగా గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో తన సొంత డబ్బులు ఖర్చుపెట్టారని, అతనికి రావాల్సిన ఏరియర్స్ బిల్లులు ఎస్టీవోలో ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆందోళనకు గురయ్యేవాడన్నారు. పనిఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతోనే మృతి చెందాడని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతునికి భార్య పద్మ, కుమారుడు ఉదయ్, కూతురు మేఘన ఉన్నారు.

విజయమే లక్ష్యంగా పోటీపడాలి


పరిచయం చేసుకుంటున్న బాలూరి గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పోటీ పడాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ హాకీ జట్టు ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనే జూన్ 8 నుంచి 11 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, హాకీ శిక్షకులు జాదవ్ రవి, శేఖర్, గోకుల్, తదితరులు పాల్గొన్నారు.

'కావాలనే కేసు పెట్టించారు'



మాట్లాడుతున్న కొండూరి గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: తాను ఎవరికీ నకిలీ పట్టాలు ఇవ్వలేదని, ఫోర్జరీ సంతకాలు చేయలేదని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి.నారాయణ గౌడ్ అనే వ్యక్తి తనపై కేసు పెట్టించారని ఆరోపించారు. 1996లో నాలుగో తరగతి ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందని, తహసీల్దారే పట్టాలు జారీ చేశారన్నారు. ఆశమ్మ అనే మహిళ ప్రభుత్వ ఉద్యోగి కాదని, డెయిలీవైజ్ ఉద్యోగి అని, ప్రభుత్వానికి డబ్బులు కట్టలేదని పేర్కొన్నారు. ఆమెకు అప్పటి తహసీల్దార్ పట్టా ఇవ్వలేదన్నారు. సుమిత్ర అనే ఉద్యోగి తమ సంఘంలో గతంలో కోశాధికారిగా పనిచేశారని, ఆమె ఇంటి స్థలాన్ని విక్రయించారని, ఆ స్థలంపై బ్యాంక్ రుణం సైతం తీసుకున్నారన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తనను రాష్ట్ర అధ్యక్షుడిగా చేస్తానని రూ.50 లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతోనే తనపై ఇలా కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు.

స్టీగ్ కంపెనీ బకాయిలు వెంటనే చెల్లించాలి


జీఎంతో చర్చిస్తున్న రియాజ్ అహ్మద్

జైపూర్: స్టీగ్ కంపెనీ నుంచి 250 మంది కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులును కోరారు. హెచ్‌ఎంఎస్ నాయకులు బుధవారం జీఎంతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి వర్క్స్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీజీఎం పర్సనల్ తుకారాం, హెచ్‌ఎంఎస్ యూనియన్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్స్ సాయికృష్ణారెడ్డి, చిప్పకుర్తి సంపత్, ప్రచార కార్యదర్శి నరసింహారెడ్డి, నాయకులు సంతోశ్, రాజ్‌కుమార్, మణికుమార్, పాల్గొన్నారు.

దడువాయిల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

భైంసాటౌన్: దడువాయిల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సంఘ సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న దడువాయిలకు కనీస వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, భైంసా అధ్యక్షుడు సతీశ్, సంజీవ్, బోనాల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

- జాగ్రత్తలు పాటిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు

పిడుగును పసిగట్టే దామిని యాప్

లక్ష్మణచాంద: ఏటా వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడి ప్రాణ, ఆస్తినష్టం జరుగుతోంది. మూగజీవాలు, అన్నదాతలు, గొర్రెలు, పశువుల కాపరులు, ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. పిడుగుపాటును ముందుగానే పసిగట్టేందుకు భారత వాతావరణ శాఖ పరిశోధనలు చేసి ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటరాలజీ(ఐఐటీఎం) అనే వాతావరణ శాఖ దామిని అనే నూతన యాప్‌ను రూపొందించింది.

డౌన్‌లోడ్ ఇలా..
- స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతిఒక్కరూ తమ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి దామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- డౌన్‌లోడ్ అయిన తరువాత యాప్‌ను ఓపెన్ చేసి తమ మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ నమోదు చేయాలి.
- అనంతరం జీపీఎస్ లొకేషన్ కోసం యాప్ అడిగే వాటికి అనుమతించాలి.

గుర్తించడం ఇలా...
- మీరు ఉన్న ప్రదేశంలో మరో 7 నిమిషాల వ్యవధిలో పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుంది.
- మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాలలో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగలోకి వస్తుంది.
- మీరు ఉన్న ప్రాంతంలో 18 నుంచి 25 నిమిషాలలో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులోకి మారుతుంది.



దామిని యాప్

జాగ్రత్తలు
1. ఆకాశం అంతటా నల్లటి మబ్బులు విస్తరించి భారీ వర్షం పడుతున్నప్పుడు రైతులు పొలంలో తిరుగకుండా సమీపంలో ఏమైనా భవనాలు ఉంటే అందులోకి వెళ్లాలి. లేదంటే తామున్న చోటనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను చేతులతో మూసుకోవాలి.
2. బహిరంగ ప్రదేశాల్లో పిడుగులు పడే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఫోన్ సిగ్నల్ ఎక్కువగా పిడుగు పడే అవకాశం కల్పిస్తుంది. కనుక మొబైల్స్ పొలాల్లో వినియోగించరాదు.
3. విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్స్, బోర్ పంపుసెట్లకు దూరంగా ఉండాలి. బోరు మోటారు నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో వినియోగించవద్దు.
4. పశువులను బయటకు మేతకు తీసుకెళ్లకుండా ఇంటివద్ద పశువుల పాకలోనే ఉంచాలి.
5. పిడుగులు పొడుగాటి చెట్లపై ఎక్కువగా పడే అవకాశం ఉంది. వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద ఉండరాదు.

ప్రాణాలు కాపాడుకోవచ్చు



వాతావరణంలో కలిగే మార్పులను ముందే పసిగట్టి పిడుగుపడే అవకాశాన్ని తెలిపే యాప్ ప్రజలకు, ప్రధానంగా అన్నదాతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు ఈ యాప్‌ను వినియోగించి పిడుగు పడే విషయాన్ని ముందుగానే గుర్తించి ప్రాణాలు కాపాడుకోవచ్చు. – వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

పీహెచ్‌సీని సందర్శించిన డీడీఎంహెచ్‌వో


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అనిత

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): 'సమయానికి రారు.. పట్టించుకోరు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎస్.అనిత హాజీపూర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఓపీ సమయాన్ని పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసాటౌన్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన వాగ్మారే షెట్టిబా (78) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బోథ్: మండలంలోని బాబేర గ్రామానికి చెందిన అత్రం దశరథ్ (49) బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దశరథ్ ఉదయం పదిగంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో బోథ్ పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుమారుడు మేఘనాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తి మద్దతు ధర రూ.8,110

- గతేడాది కంటే రూ.589 పెరుగుదల
- ఈసారి సోయాబీన్ ధర రూ.5,328

ఆదిలాబాద్‌అర్బన్: ప్రభుత్వం 2025–26కు సంబంధించి వివిధ రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించింది. రైతులు రానున్న మార్కెట్ సీజన్లో ఏఏ పంటలు ఏధరకు విక్రయించాలో స్పష్టంగా తెలిపింది. జిల్లాలో ఎక్కువ మొత్తంలో పత్తి పంట సాగవుతుంది. తర్వాతి స్థానంలో సో యాబీన్, కందులు, మినుము, పెసర, తదితర పంటలు ఉన్నాయి.

గతేడాదికంటే రూ.589 అదనం
ఈ ఏడాది పత్తి పంటకు ప్రభుత్వం రూ.8,110 మద్దతు ధర ప్రకటించింది. లాంగ్ స్టెపుల్ కలిగి ఉండి నాణ్యతతో ఉన్న పత్తికి ఈ ధర వర్తిస్తుంది. గతేడాది సీజన్‌లో మద్దతు ధర.7,521 ఉండగా ప్రభుత్వం ఈసారి రూ.589 పెంచింది. ప్రతీ సంవత్సరం ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతున్నా పెరిగిన ధరలు, ఖర్చుల దృష్ట్యా రైతులకు కలిసి రావడం లేదు. దీంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. కాగా సోయాబీన్ మద్దతు ధర కూడా పెరిగింది. గతేడాది రూ.4,892 ఉండగా ఈసారి రూ.5,328గా ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఇలా..

పంట	ప్రస్తుత ధర	పెరిగిన ధర
వరి	2,300	2,369
పెసర	8,682	8,768
జొన్న	3,371	3,699
మొక్కజొన్న	2,225	2,400
వేరుశనగ	6,783	7,263
సోయాబీన్	4,892	5,328
సన్‌ఫ్లవర్	7,280	7,721
పత్తి	7,521	8,110

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


జిల్లా కేంద్రంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు రెండోరోజు బుధవారం హోరాహోరిగా సాగాయి. మంచిర్యాల పట్టణంలోని ఉషోదయ స్కూల్, హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ పోలీసు బెటాలియన్, మందమర్రిలోని సింగరేణి మైదానంలో జరుగుతున్న పోటీలకు 90 మంది క్రీడాకారులు ఆరు జట్లుగా ఏర్పడి తలపడుతున్నారు. ప్రతీ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందని కోచ్ ప్రదీప్ తెలిపారు. వివిధ జట్లతో తలపడుతున్న వారిలో దర్శన్ రెండు సెంచరీలు (114, 105), శ్రీచరణ్ 141 పరుగులు, అబ్దుల్ రహమాన్ 5/50, 6/40 వికెట్లు తీయగా, సింహాద్రి, 100, సాయికృష్ణారెడ్డి 100 పరుగులు కొట్టారు. మందమర్రిలో జరిగిన మ్యాచ్‌లో రెడ్ జట్టుతో తలపడిన, గ్రీన్ జట్టు బ్యాట్స్‌మెన్ ఏ. సంతోశ్ 104 బాల్స్‌లో 249 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. బెటాలియన్‌లో జరిగిన మ్యాచ్‌లో సాయికృష్ణారెడ్డి 100 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా, మంచిర్యాలలోని ఉషోదయ పాఠశాలలో జరిగిన మ్యాచ్‌లో షేక్ అబ్దుల్ రహమాన్ 100 పరుగులు సాధించి ప్లేయర్ ఆప్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఎంపికై న క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పంపించనున్నట్లు కోచ్ తెలిపారు.

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్ తెలిపారు. 2025–26 సంవత్సరానికిగానూ తెలంగాణ రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశానికి జూన్ 1న సిద్దిపేటలోని వాలీబాల్ అకాడమీలో, 10న రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీలో, 10, 11 తేదీల్లో ఓయూ క్యాంపస్‌లోని సైక్లింగ్ వెల్‌డ్రోమ్‌లోని సైక్లింగ్, రైబ్లింగ్ అకాడమీలో, హన్మకొండలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో, 12న వనపర్తిలోని హాకీ అకాడమీ, ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీ, 12, 13 తేదీల్లో మహబూబ్‌నగర్‌లోని వాలీబాల్ అకాడమీలో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ జనన ధృవీకరణ పత్రం, స్పోర్ట్స్‌కు సంబంధించిన జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ధృవపత్రాల నకలు ప్రతులతో సంబంధిత అకాడమీలో రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 9963539234 నంబరులో సంప్రదించాలన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.